సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం | 4 | జూన్ | 2023



చిట్టీల పేరుతో ఘరానా మోసం

ఎంతో నమ్మకంతో చిట్టీలు వేస్తూ, ఆపై అధిక వడ్డీ ఎర వేసి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన ఓ వ్యాపారి పలాయనం చిత్తగించాడు. కరప మండలం వేములవాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. -10లో



తూర్పు డెల్టాకు పెంపు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 50, పశ్చిమ డెల్టాకు 50 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
43.5° / 27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	43.5	30.0
కాకినాడ	38.3	28.7
అమలాపురం	43.5	27.0

గోదారి గుండెల్లో రైళ్లు..



ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం

- బాలేశ్వర్ రైలు ప్రమాదంతో ఉలిక్కిపడిన ఉమ్మడి 'తూర్పు'
- రైల్వే, జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం
- రైల్వే స్టేషన్లు, కలెక్టరేట్లు, హోంమంత్రి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లు
- కంట్రోల్ రూములకు రాని ఫోన్ కాల్స్ అందరూ భద్రమేనని భావన
- పని చేయని మరికొందరి సెల్‌ఫోన్లు

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం సిటీ: ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో జరిగిన మూడు రైళ్ల ఘోర ప్రమాదం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఓ కుదుపు కుదిపేసింది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు రాకపోకలు చేసేవారు ఇక్కడి నుంచి ఎక్కువే కావడంతో పలువురు దిగ్భ్రమ చెందారు. శనివారం తెల్లవారేసరికి మృతుల సంఖ్య తెలుసుకుని ఉలిక్కిపడ్డారు. ఈ ఘోర కలితో కదిలిపోయారు. కోరమండల్‌కు రాజమహేంద్రవరం స్టేషన్‌లో హాల్టు ఉంది. ఇక్కడి నుంచే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలు భువనేశ్వర్, కోల్‌కతా తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రైలులో వెళ్లిన తమ వారెవరైనా ప్రమాదంలో చిక్కుకున్నారా, సురక్షితంగా ఉన్నారో లేదోననే ఆందోళన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. తమ బంధువులకు ఫోన్లు చేసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. సురక్షితంగా ఉన్నారన్న సమాచారంతో పలువురు ఊపిరి పీల్చుకున్నారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లోని అధికారులు అప్రమత్తమయ్యారు. 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను బాధితుల బంధువులెవరూ ఆశ్రయించలేదు.

ఉమ్మడి 'తూర్పు' వాసులు సేఫ్

- తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఐదుగురు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకున్నారు. రాజమహేంద్రవరానికి బాధితుడు మురళీకృష్ణ విశాఖపట్నం చేరుకున్నారు. మరో ఇద్దరు ప్రయాణికులు అనూప్‌కుమార్, అనామికా కుమారి కూడా రాజమహేంద్రవరం వచ్చేశారు.

రాజమహేంద్రవరానికి రిజర్వేషన్ చేయించుకుని మొబైల్ నంబర్ పని చేయక ఆచూకీ తెలియని ప్రయాణికులు

రాజవర్ధన్, ఆరాధ్య కుమారి, డి.ఇందిరా కుమారి, డి.లోకేష్, బి.పంజా, సుశాంత్, అభిషిక్త్

హెల్ప్‌డెస్క్/కంట్రోల్ రూములు

- రైలు ప్రమాద బాధితుల కుటుంబ సభ్యుల సౌకర్యార్థం రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లలో హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఆయా జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోలు రూములు ఏర్పాటు చేశారు. ప్రమాదంలో జిల్లా వాసులు ఎవరైనా ఉంటే ఈ నంబర్లలో సంప్రదించాలని ఆయా జిల్లాల కలెక్టర్లు కోరారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది, వీఆర్‌ఓలు, వలంటీర్ల ద్వారా ఆయా జిల్లాలకు చెందిన వారి సమాచారం సేకరించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను కలెక్టర్లు ఆదేశించారు.
- రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్: 0883 – 2420541, 2420543
- సామర్లకోట రైల్వే స్టేషన్: 73826 29990
- తూర్పు గోదావరి కలెక్టరేట్: 89779 35609
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్: 08856 – 293104, 293198
- కాకినాడ జిల్లా కలెక్టరేట్: 1800-425-3077
- కాకినాడ జిల్లా పోలీస్ కంట్రోల్ రూము: 94906 18506, 94949 33233

- రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన దంపతులు హరిబాబు, అన్నపూర్ణ బంధువుల ఇంట శుభకార్యానికి భువనేశ్వర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారిద్దరూ అక్కడ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాల్సి ఉంది. అక్కడకు రాకముందే ఈ రైలు ప్రమాదానికి గురవడంతో వారు మరో మార్గంలో రాజమహేంద్రవరం బయలుదేరారు.
- కొవ్వూరుకు చెందిన పాలెంపాటి అప్పారావుకు ఈ రైలు ప్రమాదంతో సంబంధం లేదు. అతడు కోరమండల్ ఎక్కేలోపే ప్రమాదం జరిగిపోయింది. దీంతో అతను వేరే రైలులో రాజమహేంద్రవరం మీదుగా కొవ్వూరు చేరుకున్నాడు.
- కాకినాడకు చెందిన మరో వ్యక్తి కూడా సురక్షితంగా ఉన్నట్టు తెలిసింది.



రైళ్లు రద్దవడంతో రాజమహేంద్రవరం స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



రాజమహేంద్రవరంలో హెల్ప్‌డెస్క్ వద్ద ప్రయాణికుల వివరాలు పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రైళ్ల రద్దుతో రద్దీ

ఒడిశా రైలు ప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను రైల్వే అధికారులు శనివారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకూ రద్దు చేశారు. దీంతో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు ఏ రైలు వస్తే అందులో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. దీంతో రెండు గంటల పాటు రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. రద్దయిన రైళ్లలో రిజర్వేషన్ పొందిన ప్రయాణికులకు పూర్తి స్థాయిలో టిక్కెట్ డబ్బులు వాపసు ఇచ్చేందుకు రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, స్టేషన్ మేనేజర్ గంగాప్రసాద్, సీటీఐ చంద్రమౌళి పర్యవేక్షించారు.

తూర్పు గోదావరి కలెక్టర్ కె.మాధవీలత ఇచ్చిన సమాచారం ప్రకారం..

కోరమండల్‌లో రాజమహేంద్రవరం వచ్చేందుకు రిజర్వేషన్ చేయించుకున్న వారు :	31
సురక్షితంగా ఉన్న వారు :	24
ఫోన్లు పని చేయక ఆచూకీ తెలియాల్సిన వారు :	7
యశ్వంత్‌పూర్ – హౌరా రైలులో వెళ్తున్న వారు :	3 (అందరూ సురక్షితం)

రద్దయిన రైళ్లు

- విజయవాడ – రాజమహేంద్రవరం – విజయవాడ (07459/07460)
- రాజమహేంద్రవరం – విశాఖపట్నం – రాజమహేంద్రవరం (07466/07467)
- కాకినాడ – విశాఖపట్నం – కాకినాడ (17267/17268)
- కాకినాడ – విజయవాడ – కాకినాడ (17258/17257)
- గుంటూరు – విశాఖపట్నం – గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239/17240)
- విశాఖపట్నం – విజయవాడ –విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701/22702)

సమగ్ర దర్యాప్తు జరపాలి

ఈ రైలు ప్రమాదం అత్యంత దురదృష్టకరమని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషనుకు శనివారం చేరుకున్న ఆయన అధికారులతో మాట్లాడారు. ఇక్కడి నుంచి ఎంతమంది కోరమాండల్ రైలుకు రిజర్వేషన్ చేసుకున్నారు, ఎంతమంది వివరాలు తెలిశాయి, ఆచూకీ తెలియని వారి కోసం ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారో స్టేషన్ మేనేజర్ ఎం.గంగాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. రైల్వేలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న దశలో ఇటువంటి ఘోర ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. ప్రమాదానికి కారణం సాంకేతిక సమస్యా లేక మానవ తప్పిదమా అనేది రైల్వే శాఖ సమగ్ర దర్యాప్తులో తేలుతుందన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో కూడా 98667 35454తో హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేశానని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ మౌళీచంద్ర, డిప్యూటీ టికెట్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ ఆకుల, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ యూత్ ప్రెసిడెంట్ పీతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లోని హెల్ప్‌డెస్క్

దేవుడే కాపాడాడు



నా కుమార్తెను తీసుకుని బెంగాల్‌లోని అసన్‌సోల్ వెళ్లాను. షాలిమార్ నుంచి రాజమహేంద్రవరం తిరిగి వచ్చేందుకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. రైలు ఒక్కసారిగా పట్టాలు తప్పింది. పెద్దగా శబ్దం రావడంతో ఏమైందోనని ఆందోళన కలిగింది. బోగీలు ఒక్కసారిగా కుదుపునకు గురయ్యాయి. ఇంక బతకమేమో అనుకున్నాం. దేవుడే కాపాడాడు. ప్రమాదం నుంచి బయటపడ్డాం. మరో ట్రైన్ ఎక్కి రాజమహేంద్రవరం పయనమయ్యా. – యానాపు మురళీకృష్ణ

బాంబు పేలిన శబ్దం వచ్చింది



మాది బిహార్. రాజోలు కామాక్షి కంపెనీలో పని చేస్తున్నాను. ఇక్కడకు వచ్చేందుకు షాలిమార్‌లో కోరమండల్ ఎక్కాను. చీకటి పడుతూండగా ఒక్కసారిగా బాంబు పేలిన శబ్దం వచ్చింది. బోగీ పల్టీలు కొట్టింది. ఏం జరిగిందోనని భయపడ్డాను. బయటకు వచ్చి చూస్తే రైలు ప్రమాదం జరిగింది. పట్టాలు తప్పిన బోగీలు చూసి టెన్షన్ పడ్డాను. తెగి పడిన కాళ్లు, చేతులు, మొండెం భాగాలను చూస్తే కడుపు తరుక్కుపోయింది. – రాజేష్‌రామ్, రైలు ప్రమాద బాధితుడు



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లోని హెల్ప్‌డెస్క్‌లో తమ వారి గురించి ఆరా తీస్తున్న వృద్ధురాలు

న్యూస్‌రీల్

జిల్లా వ్యవసాయ అధికారిగా బోసుబాబు



ముమ్మిడివరంలో డీఏఓ బోసుబాబును కలిసిన ఏడీఏ వెంకట రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది

కొత్తపేట/ముమ్మిడివరం: జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ)గా వి.బోసుబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆవిర్భావం అనంతరం డీఏఓగా నియమితులైన వై.ఆనందకుమారి కొంత కాలం నుంచి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి డీఏఓగా ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు పని చేశారు. కాగా రాజమహేంద్రవరంలోని జిల్లా రిసోర్స్ సెంటర్ (డీఆర్‌సీ) డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేసిన బోసుబాబును డీఏఓగా నియమితులయ్యారు. ఆయన ముమ్మిడివరంలోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారని కొత్తపేట ఏడీఏ, ముమ్మిడివరం ఇన్‌చార్జి ఏడీఏ ఎం.వెంకట రామారావు 'సాక్షి'కి తెలిపారు. డీఏఓను వెంకట రామారావు, ఆయా సబ్ డివిజన్లలోని అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

రుడాలో ఆలమూరు మండలం విలీనం

ఆలమూరు: మండల పరిధిలోని 18 గ్రామాలను రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా)లో విలీనం చేశారు. ఎంపీడీఓ కె.జాన్ లింకన్ శనివారం ఈ విషయం తెలిపారు. ఈ విలీనం వలన అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఇప్పటికే రుడా పరిధిలోని గ్రామాల వద్ద ఆ పేర్లతో బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు.

వాడపల్లి.. భక్తజన గోదారి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజన గోదారిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 33 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు భక్తులు కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని వివిధ రకాల పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయం, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.16,20,012 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారిని ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని చైర్మన్ రమేష్‌రాజు అందజేశారు. స్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వై.రాంబాబు, దేవి దంపతులు (రాజోలు) రూ.29 వేలు, పి.లక్ష్మణరెడ్డి, వనజాలక్ష్మి దంపతులు (మార్టేరు) రూ.10,116 చొప్పున విరాళాలు సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

వైభవంగా బాలబాలాజీ శ్రీపుష్పయాగం

మామిడికుదురు: వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి శ్రీపుష్పయాగం శనివారం రాత్రి 8.30 గంటలకు వైభవంగా జరిగింది. అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, వడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర అర్చకులు వేద పఠనంతో పూజా క్రతువులు నిర్వహించారు. విష్వక్సేన పూజ, మండపారాధన, ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పలు రకాల పండ్లు, పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు. ముత్తయిదువలకు పసుపు కుంకుమలు అందజేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం పవళింపు సేవతో కల్యాణోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీరామ వరప్రసాదరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు. పలువురు కళాకారులు కూచిపూడి, జానపద నృత్యాలు, భజన కార్యక్రమాలతో అలరించారు.

మలికిపురంలో కలెక్టర్ పర్యటన



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 7న మలికిపురం పర్యటనకు వచ్చే అవకాశముందని జిల్లా ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యాన జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఎస్పీ, ఆర్డీఓలు మలికిపురంలో పర్యటించారు. ఆ రోజు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తనయుడి వివాహానికి సీఎం హాజరవుతారని వచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు కలెక్టర్ పర్యటన సాగింది. సత్యజ్యోతి థియేటర్ వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు.

వేలిముద్రల ఇక్కట్లకు చెక్

- రేషన్ పొందలేకపోతున్న వారికి ఊరట
- ఐరిస్‌తో సరకులు పొందే అవకాశం
- జిల్లాలో 355 ఎండీయూ వాహనాలు
- వీటన్నింటికీ సంబంధిత పరికరాలు
- ఈ నెల నుంచే కొత్త విధానం అమలు



రేషన్ లబ్ధిదారుల ఐరిస్ తీసుకుంటున్న ఎండీయూ ఆపరేటర్

రాయవరం: రేషన్ పంపిణీలో కొత్త మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ప్రతి నెలా రేషన్ సరకులను బయోమెట్రిక్ విధానంలో పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో వేలిముద్రలు పడక పలువురు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా, మహిళలు, ఇంటి పనులు, కూలి పనులకు వెళ్లే వారు, వృద్ధులకు వేలిముద్రల్లో రేఖలు అరిగిపోవడంతో ఈ సమస్య ఎదురవుతోంది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రతి సోమవారం జరుగుతున్న స్పందనలో అధికారులకు పలువురు విన్నవించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాహితమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం వారి ఇబ్బందులు పరిష్కరించే దిశగా తక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా బయోమెట్రిక్‌తో పాటు ఐరిస్ (కంటిపాప గుర్తింపు) ద్వారా రేషన్ పొందే వీలు కల్పించింది. దీంతో ఈ నెల నుంచి బయోమెట్రిక్‌తో పాటు ఐరిస్ ద్వారా కూడా రేషన్ పంపిణీ చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఐరిస్ స్కానర్లను జిల్లా పౌర సరఫరాల యంత్రాంగం అందుబాటులోకి తీసుకు వచ్చింది. వీటిని జిల్లాలోని 355 మంది మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) నిర్వాహకులకు అందజేశారు. తొలుత వేలిముద్రల ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల ఐరిస్ సేకరించి, ఈ పరికరంలో ఫీడ్ చేస్తారు. వేలిముద్రలు పడకపోతే ఐరిస్ ఆధారంగా రేషన్ పంపిణీ చేస్తారు. ఐరిస్ ఏవిధంగా తీసుకోవాలనే అంశంపై ఎండీయూ ఆపరేటర్లకు జిల్లా పౌర సరఫరాల శాఖ ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. గత 29న అమలాపురం, 30న కొత్తపేట, 31న రామచంద్రపురం డివిజన్ల పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లకు ఐరిస్ స్కానర్ వినియోగంపై అవగాహన కల్పించారు. కొత్త మార్పుతో వేలిముద్రలు పడని లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పాయి.

జిల్లాలో వివిధ రకాల రేషన్ కార్డులు 5,36,359 ఉన్నాయి. వీటి ద్వారా 15,16,488 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, పంచదార అందజేస్తోంది. కార్డులోని లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున బియ్యం అందిస్తోంది. దీంతోపాటు ప్రతి కార్డుపై కేజీ కందిపప్పు, అరకేజీ పంచదార పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా నేరుగా వారి ఇళ్ల వద్దనే రేషన్ వాహనాల ద్వారా సరకులు అందజేస్తున్నారు.

రెవెన్యూ డివిజన్ల వారీగా ఎండీయూ వాహనాల వివరాలు

డివిజన్	వాహనాలు
అమలాపురం	150
రామచంద్రపురం	104
కొత్తపేట	101
మొత్తం	355

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలు

అంత్యోదయ అన్నయోజన :	24,804
లబ్ధిదారులు :	58,483
రైస్/తెలుపు రంగు కార్డులు :	5,11,555
లబ్ధిదారులు :	14,58,005
మొత్తం రేషన్ కార్డులు :	5,36,359
లబ్ధిదారులు :	15,16,488

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ అందించాలనే..



దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు బియ్యం కార్డుల ద్వారా ప్రభుత్వం రేషన్ సరుకులు అందజేస్తోంది. వేలిముద్రలు పడని లబ్ధిదారుల ఇబ్బందులను తొలగించేందుకే ప్రభుత్వం ఐరిస్ స్కానర్లను అందజేసింది. ప్రతి లబ్ధిదారుకూ రేషన్ సరకులు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.
– ఎ.పాపారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి

క్లుప్తంగా

భర్త చేతిలో భార్య హతం



హత్యకు గురైన కనకదుర్గ (పాత చిత్రం)

మలికిపురం: ఓ మహిళను ఆమె భర్తే హత్య చేసిన సంఘటన మండలంలోని తూర్పుపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొల్లు అర్జునరావు వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి పదేళ్ల క్రితం కనకదుర్గ(28)తో వివాహమైంది. ఆమె దివ్యాంగురాలు. వీరికి ఇద్దరు మగ బిడ్డలున్నారు. పిల్లలు చెబుతున్న వివరాల ప్రకారం.. వీరికి పెద్ద మొత్తంలో అప్పులున్నాయి. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు కొంత కాలం నుంచి గొడవలు పడుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి కూడా వీరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన అర్జునరావు కత్తితో తన భార్య పీక కోసి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న కనకదుర్గ మృతదేహాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. మలికిపురం ఎస్సై జి.సురేంద్ర, ఐఎస్సై సత్యనారాయణలు పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు ప్రధాన కారణాలేమిటనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కనకదుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల్లో రజతం



రజత పతకం అందుకుంటున్న సుహాస్

కొత్తపేట: ఆలిండియా నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తపేట మండల విద్యార్థి నేలపూడి సుహాస్ రజత పతకం సాధించాడు. అతడు గంటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. హర్యానా రాష్ట్రం రోహ్తక్‌లో శనివారం జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నర్‌గా నిలిచాడు. సుహాస్‌కు బాక్సింగ్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించిన పాఠశాల పీడీ వి.భువనేశ్వరి శిక్షణ ఇప్పించారు. జాతీయ స్థాయి పోటీలకు తీసుకువెళ్లి ద్వితీయ విజేతగా నిలిపారని హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. అక్కడ ప్రముఖుల చేతుల మీదుగా సుహాస్ మెడల్ అందుకున్నాడని చెప్పారు.

ప్రతిభావంతులకు ఉపకారం

- ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్‌షిప్పులు
- దరఖాస్తుకు 15 వరకూ గడువు

రాయవరం: ప్రతిభావంతులకు గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది. చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపుతూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజిని దామోదరన్ ఫౌండేషన్ (ఎస్‌డీఎఫ్) ద్వారా 'విద్యాదాన్' ఉపకార వేతనం అందిస్తోంది. కళాశాల విద్యలో సత్తా చాటే వారికి ఇది ఒక వరంలా మారనుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవాల్లో అమలవుతోంది. ఇప్పటి వరకూ ఈ పథకం కింద 6,500 మంది లబ్ధి పొందారు. ఎంపికైన వారు ఫౌండేషన్ నుంచి రెండేళ్ల పాటు స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ స్కాలర్‌షిప్ అందజేస్తారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎంపికైన విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తారు.

ఇదీ అర్హత

విద్యాదాన్ ఉపకార వేతనం పొందడానికి విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులు. పదో తరగతిలో కనీసం 90 శాతం మార్కులు లేదా 9 శాతం జీపీఏ సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు లేదా 7.5 శాతం జీపీఏ సాధించాలి.



విద్యాదాన్ స్కాలర్‌షిప్ లోగో

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. వారికి ఈ–మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

విద్యాదాన్ ఉపకార వేతనానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. జూలై 2న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. దరఖాస్తుదారులు పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువపత్రం, చదువుతున్న కళాశాల వివరాలు పొందుపరచాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగత ఈ–మెయిల్ కలిగి ఉండాలి. నెట్ సెంటర్ లేదా ఇతరుల ఈ–మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ–మెయిల్ లేదా ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. వివరాలకు సోమవారం నుంచి శనివారం మధ్య ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 'విద్యాదాన్.ఆంధ్ర ఎస్‌డీ ఫౌండేషన్ @ ఇండియా.కామ్'ను సంప్రదించాలి. లేదా 83677 51309, 89858 01326 నంబర్లకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించాలి.



విద్యార్థులు

- విద్యార్థులు నేరుగా ప్లే స్టోర్‌లోని 'విద్యాదాన్' యాప్ ద్వారా లేదా 'విద్యాదాన్ వెబ్‌సైట్' డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాదాన్.ఓఆర్‌జీలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం మీ పేరులో మొదటి పేరు ఎంటర్ చేయాలి. తర్వాత రెండో పేరు నమోదు చేయాలి. అనంతరం విద్యార్థి అడ్రస్ ఎంటర్ చేయాలి. తర్వాత 'అప్లై నౌ' ఆప్షన్ క్లిక్ చేస్తే అకౌంట్ యాక్టివేషన్‌కు సంబంధించిన లింక్ మీ ఈ–మెయిల్‌కు వస్తుంది. ఆ లింక్ క్లిక్ చేయగానే విద్యాదాన్ హోమ్ పేజీలో 'అకౌంట్ యాక్టివేటెడ్' అనే మెసేజ్ వస్తుంది. అనంతరం ఈ–మెయిల్ ఐడీ, విద్యాదాన్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయి, స్టెప్–2లోకి వెళ్లాలి.
- లాగిన్ అయిన తర్వాత హెల్ప్‌పై క్లిక్ చేసి, సూచనలు చదివి, ఆ ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. అవసరమైతే ఎడిట్‌పై క్లిక్ చేసి, అప్లికేషన్ ఎడిట్ చేసుకోవచ్చు. వివరాలు ఎంటర్ చేసిన తర్వాత 'సబ్‌మిట్'పై క్లిక్ చేయాలి. 'సబ్‌మిషన్ సక్సెస్‌ఫుల్' అని వస్తుంది.
- డాక్యుమెంట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేసిన తర్వాతే దరఖాస్తుకు ఆమోదం లభిస్తుంది.
- దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు ఈ–మెయిల్ చెక్ చేసుకోవాలి.

చిట్టీల పేరుతో ఘరానా మోసం

- అధిక వడ్డీ ఎర చూపి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ
- పోలీసులకు ఫిర్యాదు
- ఎమ్మెల్యే కన్నబాబుకు గోడు చెప్పుకొన్న బాధితులు



ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేశ్వరరావు

కరప: ఎంతో నమ్మకంతో చిట్టీలు వేస్తూ, ఆపై అధిక వడ్డీ ఎర వేసి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన ఓ వ్యాపారి పలాయనం చిత్తగించాడు. కరప మండలం వేములవాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బాధితులు, కరప పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండి కామేశ్వరరావు, అతడి కుమారుడు దుర్గరాజు చాలా కాలం నుంచి కిరాణా వ్యాపారం చేస్తున్నారు. తర్వాత చిట్టీల వ్యాపారం మొదలు పెట్టి, గ్రామస్తులకు నమ్మకం కలిగించారు. డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, చిరు ఉద్యోగులు, రైతులకు అధిక వడ్డీ ఎర చూపించి, సొమ్ములు తీసుకునేవారు. చిట్టీలు పాడుకున్న వారి డబ్బులు కూడా వడ్డీ పేరుతో తనవద్దే ఉంచేసుకునేవారు. మధ్యమధ్యలో వడ్డీలు చెల్లించడంతో గ్రామస్తుల్లో బాగా నమ్మకం ఏర్పడింది. దీంతో వేములవాడతో పాటు కరప, వేళంగి, జి.వేమవరం, రామచంద్రపురం తదితర గ్రామాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.1.50 కోట్లు సేకరించిన కామేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి పలాయనం చిత్తగించాడు. కొంత కాలం నుంచి వారు కనిపించకపోవడంతో పని మీద ఊరికి వెళ్లి ఉంటారని గ్రామస్తులు భావించారు. పది రోజుల క్రితం కామేశ్వరరావు వచ్చి, గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోని సామాన్లు తీసుకుని వెళ్లిపోయాడు. మరో ఇంట్లో ఉన్న సామాన్లను అతడి కోడలు భవాని ఆటోలో తీసుకువెళ్లిపోతూంటే అనుమానం వచ్చి, గ్రామస్తులు నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఆమెను గ్రామస్తులు కరప పోలీసులకు అప్పగించారు. తీసుకున్న సొమ్ముల్ని వాయిదాల పద్ధతితో తీరుస్తామని పెద్దల సమక్షంలో కాగితం రాసివ్వడంతో పోలీసులు వారిని వదిలేశారు. అనంతరం కామేశ్వరరావు కుటుంబ సభ్యులు గ్రామస్తుల కళ్లుగప్పి బిచాణా ఎత్తేశారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు శనివారం కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కరప వచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబును సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్‌తో కలిసి, ఆశ్రయించి తమ గోడు చెప్పుకొన్నారు. మోసగాళ్లను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని కరప ఎస్సై ఎస్.రామకృష్ణను ఎమ్మెల్యే ఆదేశించారు. కామేశ్వరరావు మాయ మాటలు నమ్మి రూ.14 లక్షలు ఇచ్చానని, చిట్టీల సొమ్ము రూ.5 లక్షలు రావాలని వేములవాడకు చెందిన శ్రీపాద లక్ష్మి విలపిస్తూ తెలిపింది. ఎక్కువ వడ్డీ వస్తుందని తెలిసిన వారి నుంచి రూ.3 లక్షలు తీసుకుని కామేశ్వరరావుకు ఇచ్చానని, రూ.5 లక్షల వరకూ చిట్టీ సొమ్ము రావాలని మరో బాధితురాలు పడాల భవాని తెలిపింది.



ఎమ్మెల్యే కన్నబాబుకు గోడు చెప్పకుంటున్న బాధితులు

ఆస్తి కోసం అక్కనే మట్టుబెట్టాడు

అంబాజీపేట: అక్క ఆస్తిపై కన్ను వేసిన తమ్ముడు చివరకు ఆమెను కడతేర్చాడు. ప్రమాదవశాత్తూ చనిపోయిందని నమ్మించేందుకు విఫలయత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వాకలగరువుకు చెందిన బొక్కా కృష్ణవేణి (47) ఒంటరి మహిళగా జీవిస్తోంది. విదేశాల్లో పని చేసి కొంత ఆస్తి సంపాదించింది. దీంతో పాటు ఆమెకు రెండంతస్తుల ఇళ్లు ఉన్నాయి. కృష్ణవేణి తమ్ముడు కాండ్రేగుల బాలయోగి అమలాపురం మండలం సాకుర్రులోని అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. కొంత కాలం నుంచి అతడు అక్క ఆస్తిపై కన్ను వేశాడు. దీనిలో భాగంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అక్క ఇంటికి వచ్చాడు. ఆస్తి కోసం కృష్ణవేణితో ఘర్షణకు దిగాడు. ఆవేశంలో విచక్షణ కోల్పోయిన బాలయోగి అక్కడున్న గునపంతో కృష్ణవేణి తల వెనుక భాగంలో బలంగా కొట్టాడు. ఆమె కేకలు వేస్తూ ఇంటి పై అంతస్తు నుంచి దిగి కొబ్బరి తోటల్లోకి పరుగు తీస్తూ స్పృహ తప్పి పడిపోయింది. రక్తం మడుగులో ఉన్న కృష్ణవేణిని గమనించిన స్థానికులు ఆమె తల్లికి సమాచారం అందించారు. అంతలోనే తనకేమీ తెలియనట్టుగా బాలయోగి ఎవ్వరూ చూడకుండా అక్కడకు చేరుకుని, కృష్ణవేణిని అంబాజీపేట పీహెచ్‌సీకి తరలించాడు. వైద్యాధికారులు పరిశీలించి, అప్పటికే కృష్ణవేణి మృతి చెందిందని ధ్రువీకరించారు. సంఘటన స్థలాన్ని సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ పరిశీలించారు. ఎస్సై కేసు నమోదు చేయగా, సీఐ దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బలయోగి పరారీలో ఉన్నాడు.

టైరు పేలి అదుపు తప్పిన ఆటో

పిఠాపురం: ఆటో టైరు పేలిపోయిన ఘటనలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గొల్లప్రోలు పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం దుర్గాడ నుంచి ఎనిమిది మంది ప్రయాణికులతో ఒక ఆటో కాకినాడ రూరల్ మండలం పండూరు బయలుదేరింది. 216 జాతీయ రహదారిపై గొల్లప్రోలు వై జంక్షన్(తాటిపర్తి సెంటర్)కు వచ్చేసరికి ఆటో ముందు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి పల్టీలు కొట్టింది. అదే సమయంలో వెనుక వస్తున్న కారు.. ఆ ఆటోను తప్పించే ప్రయత్నంలో డివైడర్‌ను దాటి అవతల వైపు దూసుకుపోయింది. ఆ కారు ముందు భాగం దెబ్బ తింది. ఆ సమయంలో ఇతర వాహనాలేవీ ఆ మార్గంలో రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఆటో ప్రయాణికులను 108లో ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో తుని వెళుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సంఘటన స్థలం వద్ద ఆగి, ప్రయాణికులను ఆస్పత్రికి తరలించేలా ఆదేశాలు ఇచ్చారు. ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

మున్సిపల్ ఇంజినీర్ల బదిలీ

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం మున్సిపాలిటీ నుంచి ముగ్గురు ఇంజినీర్లు బదిలీ అయ్యారు. రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలకు కూడా కొత్తగా ఇద్దరు ఇంజినీర్లు బదిలీలపై వస్తున్నారు. ఇప్పటి వరకూ అమలాపురం మున్సిపల్ డీఈఈగా పనిచేసిన కొత్త అప్పలరాజు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీ డీఈఈగా బదిలీపై వెళుతున్నారు. ఆయన స్థానంలో అమలాపురం మున్సిపాలిటీకి కొత్త డీఈఈగా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ డీఈఈ బి.విజయదుర్గ రానున్నారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న ఎస్.హేమంత్ శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపల్ ఏఈగా బదిలీపై వెళుతున్నారు. ఆయన స్థానంలో నిడదవోలు మున్సిపల్ ఏఈ కె.వెంకటేష్ బదిలీపై వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మరో ఏఈ ఎస్.వెంకటేశ్వరరావుకు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ ఏఈగా బదిలీపై వెళుతున్నారు. ఆయన స్థానంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏఈ వి.కృష్ణ ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. అమలాపురం మున్సిపల్ ఇంజినీర్ల బదిలీ విషయాలను కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు.

ఆ రెండు మున్సిపాలిటీలకు కొత్త ఏఈలు

జిల్లాలోని రామచంద్రపురం మున్సిపాలిటీ ఏఈగా ఎండీ జస్మిన్ బదిలీపై వస్తున్నారు. ఆయన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏఈగా పనిచేస్తూ బదిలీ అయ్యారు. అలాగే మండపేట మున్సిపాలిటీ ఏఈగా డీవీ పవన్ బదిలీపై వస్తున్నారు. ఆయన ఇప్పటివరకూ ముమ్మిడివరం నగర పంచాయితీలో ఏఈగా పనిచేస్తూ బదిలీ అయ్యారు.